సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం। 17। జూలై। 2024



అండర్ 19 వన్డే క్రికెట్ టోర్నీ ప్రారంభం

కడప నగరంలో ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా ప్రారంభమైంది. - 8లో



నేటి నుంచి తాళ్లపాకలో బ్రహ్మోత్సవాలు

పద కవితా పితామహుడు అన్నమాచార్యులు జన్మస్థలి తాళ్లపాకలో బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.740	రూ.880
రెండోరకం	రూ.580	రూ.720

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 604 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	370	405
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 251.520 కిలోలు



జ్వరం.. కలవరం.!




నా పేరు వెంకటరమణ. మాది పాత రాయచోటి. రెండు రోజులుగా ప్రభుత్వ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాను. ఎక్కడ చూసినా మురుగునీరు నిల్వ ఉంటోంది. దీంతో దోమల బెడద ఎక్కువైంది. రాత్రి పూట దోమలు విపరీతంగా దాడి చేస్తున్నాయి. విరేచనాలు, విషజ్వరాలతో అల్లాడుతున్నాము. రెండు రోజుల క్రితం తీవ్ర జ్వరంతో ఆస్పత్రికి వచ్చాను. మా ఊరిలో చాలా మంది విషజ్వరాలు, విరేచనాలతో బాధపడుతున్నారు. ఆర్థికంగా ఉన్న వారైతే ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి వైద్యం పొందుతున్నారు. మాలాంటి వాళ్లేమో ఇలా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాము.

ప్రస్తుతం వాతావరణం మారింది. వానలు జోరందుకుంటున్నాయి. వాటితో పాటే సీజనల్ రోగాలు విజృంభిస్తున్నాయి. డెంగీ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయి. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా చుట్టుముడుతున్నాయి. ఎక్కడికక్కడ అపరిశుభ్ర వాతావరణం, తాగునీరు కలుషితం కావడంతో డయేరియా, విష జ్వరాలు కలవరపెడుతున్నాయి. ముసురుతున్న వ్యాధుల నియంత్రణకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడం అవసరం.

- వర్షాల సీజన్ ప్రారంభంతోనే వ్యాధుల పంజా
- మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, జలుబుతో ప్రమాదం
- ప్రధాన ఆస్పత్రుల్లో పెరుగుతున్న ఔట్ పేషెంట్లు
- పొరుగున ఉన్న వైఎస్సార్ జిల్లాలో డయేరియా కేసులు
- పొంచి చూస్తున్న వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిందే
- డిసెంబరు వరకు జాగ్రత్తలు లేకపోతే ప్రమాదం

సాక్షి రాయచోటి : వాతావరణంలో మార్పులు మొదలు కాగానే అప్పుడే వ్యాధులు ముసురుతున్నాయి. ఎప్పుడు చూసినా ప్రతిసారి ఇదే సీజన్‌లో జ్వరాలు వెంటాడుతూ వస్తున్నాయి. 2020 నుంచి 2022 వరకుకరోనా లాంటి వైరస్‌లతో అట్టుడికిన జనానికి ప్రస్తుతం వ్యాధుల భయం వెంటాడుతోంది. జులై నుంచి డిసెంబరు వరకు వ్యాధుల సీజన్‌గా వైద్య ఆరోగ్యశాఖ గుర్తించడం పరిపాటే. అయితే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం అప్పుడప్పుడు తొలకరి జల్లులతోపాటు తుపాన్లు...వాతావరణం ఎప్పటికప్పుడు మారుతున్న తరుణంలో వ్యాధులు కూడా పొంచి చూస్తున్నాయి. ఈ సీజన్‌లో ప్రధానంగా నాలుగైదు రకాల జ్వరాలతోపాటు జలుబు,



అస్తమా, వైరల్‌జ్వరాలు, శ్వాసకోశ సంబంధిత వ్యాధుల ప్రభావం అధికంగా ఉంటుంది. అయితే ఇప్పటికే జలుబు, జ్వరాలు విస్తరిస్తున్నాయి. ఎక్కడికక్కడ ఆస్పత్రుల వైపు రోగులు వెళుతుండడంతో ఓపీల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. మరో వైపు వైద్య ఆరోగ్యశాఖ కూడా ప్రత్యేక చర్యలకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

జ్వరాలతో ప్రమాదం

ఈ సీజన్‌లో ఆరు నెలలపాటు జాగ్రత్తగా ఉండకపోతే ఇబ్బందులు తప్పవు. టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు విస్తరిస్తున్నాయి. డెంగీ జ్వరం సోకిన వ్యక్తికి రక్తకణాల కొరత ఏర్పడడంతో పరిస్థితి విషమించే ప్రమాదముంది. వైరల్ జ్వరాల పట్ల కూడా ప్రజలు ఒకింత అప్రమత్తంగా ఉండాలి. ఇంటిలో ఒకరికి వచ్చినా మిగతా వారికి విస్తరించే అవకాశం ఉంటుంది. ప్రధానంగా 2023లో జిల్లాలో 169 డెంగీ కేసులు నమోదు కాగా, ఇప్పటివరకు 81 కేసులు నమోదయ్యాయి. మలేరియా కూడా గతేడాది ఒక్క కేసు నమోదు కాగా, ఈసారి మూడు కేసులు నమోదయ్యాయి. వైద్య ఆరోగ్యశాఖ ఆస్పత్రుల్లో ఈ కేసులు నమోదైనా, ఇతర ప్రైవేటు ఆస్పత్రులు, బయటి ప్రాంతాల్లో అధిక సంఖ్యలో కేసులు నమోదువుతున్నట్లు తెలుస్తోంది. డయేరియా కూడా గతేడాది 4316 కేసులు నమోదు కాగా, ఈసారి ఇప్పటివరకు 2878 కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతానికి ఇలా ఉన్నా రానురాను కేసుల సంఖ్య పెరిగే అవకాశం లేకపోలేదు.



రాయచోటి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



రాయచోటి పట్టణంలోని మాండవ్య నది దోమల ఉత్పత్తి కేంద్రంగా మారిన దృశ్యం

సీజన్‌లో పరిశుభ్రతదీ ప్రధాన పాత్ర

పలు వ్యాధులకు పరిసరాల అపరిశుభ్రత కూడా ఓ కారణంగా నిలుస్తోంది. ప్రజలు తాము నివసిస్తున్న ప్రాంతాల్లో మురికి నీరు, వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. నీరు నిల్వ ఉన్నట్లయితే లార్వా ఉత్పత్తి జరిగి దోమల పెరుగుదలకు కారణమవుతాయి. జిల్లాలోని పట్టణ ప్రాంతాలతోపాటు మేజర్ పంచాయతీల్లో ఫాగింగ్‌కు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రజలు సాధ్యమైనంత వరకు వేడి పదార్థాలను తీసుకోవడంతోపాటు గోరు వెచ్చిన నీరు తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

ఆస్పత్రులు కిటకిట

ఈ సీజన్‌లో ప్రస్తుతం వర్షాలు ప్రారంభం కావడంతో ఇప్పుడిపప్పుడే జలుబు, జ్వరాలు, డయేరియా కేసులు కూడా నమోదవుతున్నాయి. జిల్లాలో అనేక రకాల సమస్యలతో ఆస్పత్రుల వైపు రోగులు వస్తుండడంతో ఎక్కడికక్కడ ప్రైవేటు ఆస్పత్రులతోపాటు ప్రభుత్వ వైద్యశాలల్లో ఓపీ సంఖ్య పెరుగుతోంది. విరేచనాలు, వాంతులు, జ్వర బాధితులు పట్టణ ప్రాంతాల్లోఅయితే పెద్దాస్పత్రులకు వెళుతుండగా, గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. పొరుగున ఉన్న వైఎస్సార్ జిల్లాలో ఇప్పటికే డయేరియా వ్యాధి విజృంభిస్తోంది. అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, రాజంపేట, మదనపల్లె జిల్లా ఆస్పత్రితోపాటు రైల్వేకోడూరు, పీలేరు, తంబళ్లపల్లె ఇలా అన్నిచోట్ల అనారోగ్య బాధితులు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు.



సుండుపల్లె మండలం రాయవరం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు

- జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు : 49
- విలేజ్ హెల్త్ క్లినిక్‌లు: 375
- జిల్లా ఆస్పత్రి: 01
- 100 పడకల ఆస్పత్రులు : 03
- 50 పడకల ఆసుపత్రి : 1
- అర్బన్ హెల్త్ సెంటర్లు: 11
- పీహెచ్‌సీలకు రోజుకు సరాసరి వచ్చే రోగులు: 70-100
- జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు నమోదైన డెంగీ కేసులు : 81

జ్వరాలకు సంబంధించి అధికారిక వివరాలు

సంవత్సరం	మలేరియా	డెంగీ	డయేరియా
2023	01	169	4316
2024 (ఇప్పటివరకు)	03	81	2878

జ్వరం, దగ్గు, జలుబులతో ఇబ్బంది పడుతున్నాను



నాకు రెండు రోజుల నుంచి దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు ఎక్కువగా ఉన్నాయి. సుండుపల్లెలోని ఆర్ఎంపీ డాక్టర్ వద్ద చికిత్స చేయించుకున్నాను. మందులు వాడుతున్నాను. వేడి నీరు తాగాలని సూచించారు. – లక్ష్మీదేవి, మడితాడు గ్రామం, సుండుపల్లె మండలం

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



జిల్లాలో వ్యాధుల సీజన్ విషయంలో అప్రమత్తంగా ఉన్నాం. ఈ విషయంగా ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని సిబ్బందికి ఇప్పటికే ఆదేశించడంతో గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలోని పీహెచ్‌సీల్లో వైద్యులతోపాటు సిబ్బందిని కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించాము. ఎహెచ్‌సీల్లో అవసరమున్న మేరకు మందులను నిల్వ ఉంచాం. – డాక్టర్ కొండయ్య, అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

న్యూస్‌రీల్

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి (జగదాంబసెంటర్): జిల్లాలో 9,10 తరగతులు(ప్రీ మెట్రిక్),ఇంటర్ ఆపై తరగతులు(పోస్టు మెట్రిక్) చదువుతున్న విభిన్న ప్రతిభావంతుల నుంచి జాతీయ ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల సహాయ సంచాలకుడు ఆర్‌వీ కృష్ణకిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. http://scholarships/gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రీ మెట్రిక్ విద్యార్థులు ఆగస్టు 31లోగా, పోస్టు మెట్రిక్ విద్యార్థులు అక్టోబర్ 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జాతీయ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు గడువు పొడిగింపు



రాయచోటి (జగదాంబ సెంటర్): భారత ప్రభుత్వ విద్యాశాఖ, న్యూ ఢిల్లీ వారు జాతీయ ఉపాధ్యాయ అవార్డు-2024కు దరఖాస్తుల గడువును పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి యు.శివప్రకాష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల ఉపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరా లకు http://nationalwardstoteacher.education.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

రైతు సేవా కేంద్రం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న పశుసంవర్థకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మాలకొండయ్య

వీరబల్లి: గడికోట గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం పశుసంవర్థకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మాలకొండయ్య తనిఖీ చేశారు. పూర్తిస్థాయిలో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిబ్బందితో ఆయన మాట్లాడుతూ నీలి నాలుక వ్యాధి రాకుండా టీకాలు వేయాలని సిబ్బందికి సూచించారు. రైతులకు కావాల్సిన సూచనలు, సలహాలు అందించాలన్నారు. పాడి ఆవులు, మేకలు, గొర్రెల విషయంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్, గోపాల మిత్ర, రవి, ఏహెచ్‌ఏ బాలు తదితరులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై సౌమ్యనాథుడు

నందలూరు: నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగో రోజు మంగళవారం సింహవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథస్వామి మాఢ వీధులలో ఊరేగారు. రాత్రి సౌమ్యనాథస్వామి సింహవాహనంపై నరసింహస్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకొని గోవింద నామస్మరణలతో ఊరేగింపు వెంట కదిలివచ్చారు.

బ్రహ్మోత్సవాలలో నేడు..

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదో రోజు బుధవారం ఉదయం పల్లకీ సేవ, తిరుమంజనం, రాత్రి హనుమంత వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు.



గ్రామోత్సవంలో సింహవాహనంపై సౌమ్యనాథుడు

పెద్ద దర్గాలో నేడు గంధోత్సవం

కడప కల్చరల్: కడప పెద్దదర్గాలో బుధవారం ఖాజా యే ఖాజుగా నాయబే రసూల్ అత్తాయే రసూలుల్లా హజరత్ ఖాజా సయ్యద్ షా పీరుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుస్సేని చిస్టివుల్ ఖాద్రి సాహెబ్ గంధం ఉత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటల నుంచి ఈ ఉత్సవం ప్రారంభం కానుందని దర్గా ప్రతినిధులు తెలిపారు. మొహర్రం నెల 10వ రోజు గురువులు జీవ సమాధి పొందిన రోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలు దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో జరగనున్నాయి. గంధం ఉత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానుండటంతో దర్గా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



కడపలోని పెద్ద దర్గా

నీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి: జిల్లాలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ గ్రామీణ నీటి సరఫరా, మున్సిపల్ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్‌ఈ, డీఈలు, ఏఈలు, మున్సిపల్ శాఖ అధికారులతో జిల్లాలో గ్రామీణ నీటి సరఫరా, పట్టణ నీటి సరఫరాపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ నీటి సరఫరాశాఖ ఎస్‌ఈ ప్రసన్న కుమార్ అన్నమయ్య జిల్లాలో గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు ఏ విధంగా నీటిని సరఫరా చేస్తున్నారు, నీటి సరఫరాకోసం ఎన్ని ట్రిప్పుల ట్యాంకర్లను వాడుతున్నారు తదితర అంశాలను కలెక్టర్‌కు వివరించారు. రాయచోటి, రాజంపేట మున్సిపల్ కమిషనర్లు పట్టణ ప్రాంతాలలో నీటి సరఫరా వివరాలను కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీటి ఎద్దడి నివారణ, జల జీవన్ మిషన్, ఎంపీ ల్యాండ్ తదితర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రాజంపేట, రాయచోటి మున్సిపల్ కమిషనర్లు రాంబాబు, వాసు, గ్రామీణ నీటి సరఫరా శాఖకు సంబంధించిన ఏఈలు, డీఈలు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉచిత ఇసుక

అన్నమయ్య జిల్లాలో ప్రజలందరికీ ఉచితంగా ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నూతన ఇసుక పాలసీ అమలు కోసం జిల్లాలో ఉన్న చెయ్యేరు, బహుదా, మాండవ్య తదితర నదులలో ఇసుక పాయింట్లను గుర్తించాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, రాజంపేట ఆర్డీఓ మోహన్‌రావు, జిల్లా మైన్స్ శాఖ అధికారి రవిప్రసాద్, డీపీఓ ధనలక్ష్మీ, నీటి వనరుల శాఖ ఈఈ భరత్, ఆర్డీఓ భరత్ చవాన్, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్‌ఈ ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

స్థానిక డిమాండ్‌ను బట్టి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ స్కిల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతకు మెండుగా ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ముందుకు వెళుతోందన్నారు. ప్రతి మండలంలో స్థానిక డిమాండును దృష్టిలో ఉంచుకుని యువతకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరిని ఉద్యోగులుగా చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమని, ఈ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, అగ్రికల్చర్ జేడీ చంద్ర నాయక్, పశు సంవర్థక శాఖ జేడీ గుణశేఖర్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

టమాటా ధర పైపైకి!

- మార్కెట్‌లో కిలో టమాటా రూ.88
- రైతులకు గిట్టుబాటు, వినియోగదారులకు ధరల పోటు
- వేసవిలో పంట సాగు విస్తీర్ణం తగ్గడమే కారణం



మదనపల్లెలోని మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

మదనపల్లె సిటీ: టమాటా ధరలు మళ్లీ పుంజుకుంటున్నాయి. మదనపల్లె మార్కెట్‌లో మంగళవారం మొదటి రకం కిలో రూ.88 పలికింది. అయితే సరుకు మాత్రం తగ్గుతుంది. సగటున 600 నుంచి 800 టన్నులలోపు కాయలు వస్తున్నాయి. గత వారం నుంచి తగ్గుతున్న టమాటా ధరలు మూడు రోజుల నుంచి క్రమేపీ పెరుగుతున్నాయి. పంట పండించిన రైతులకు ప్రస్తుతం మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తుండగా, వినియోగదారులకు ధరల పోటు తగలుతోంది. ఆగస్టు రెండో వారం వరకు ఇదే పరిస్థితి ఉంటుందని, ఆ తర్వాత ధరలు తగ్గుముఖం పట్టి సాధారణ స్థాయికి చేరుకుంటాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

తేదీ	మొదటి రకం (10 కిలోలు)	రెండో రకం
16-7-24	888.00	720.00
15-7-24	800.00	580.00
14-7-24	720.00	580.00
13-7-24	660.00	560.00
12-7-24	640.00	540.00

వేసవిలో సాగు తగ్గడమే కారణం

ఏటా వేసవిలో టమాటా సాగు తగ్గుతోంది. అధిక ఉష్ణోగ్రతలు, నీటి కొరత, వేడికి దిగుబడులు రాకపోవడం వంటి కారణాలతో టమాటా సాగు తగ్గించారు.

సబ్సిడీ టమాటా విక్రయాలు ఎక్కడ.?

టమాటా ధరలు పెరుగుతున్న సమయంలో ప్రభుత్వం రైతు బజార్ల ద్వారా సరసమైన ధరలకు టమాటా విక్రయిస్తున్నట్లు ప్రకటించింది. అయితే మదనపల్లెలో ఎక్కడా విక్రయించిన దాఖలాలు లేవు.

క్లుప్తంగా

పంటలపై పందుల దాడులు


పందుల దాడిలో ధ్వంసమైన అరటి మొలకలు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని అనంత రాజంపేట, రాఘవరాజపురం, బొజ్జవారిపల్లె, ఉర్లగడ్డపోడు, శెట్టిగుంట, రెడ్డివారిపల్లె తదితర గ్రామాల్లో అరటి తోటల్లో పందులు నిత్యం దాడులు చేస్తున్నాయి. తోటల్లో చొరబడి మొలకలు పీకేసి చిందరవందర చేస్తున్నాయి. రోజుకు 50–150 చెట్ల వరకు ధ్వంసం చేస్తూ రైతులకు నష్టాన్ని మిగిల్చుతున్నాయి. రూ.10–15కు అరటి మొక్క కొని నాటినప్పటి నుంచి అడవి పందులు చేలల్లో దాడులు చేసి పీకేస్తున్నాయి. రైతులు ఎకరాకు 700 నుంచి 800 వరకూ మొక్కలు నాటారు. ఏదో చోట పందులు దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయి. రాత్రి వేళల్లో మనిషి కాపలా ఉన్నా వారిపైనా దాడులకు దిగుతున్నాయి. నివారించే మార్గంలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం రాయితీపై ఇనుప కంచె మంజూరు చేస్తే తమకు మేలు జరుగుతుందని రైతులు కోరుతున్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు

– జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి

సిద్దవటం : జిల్లాలో అక్రమ లే అవుట్లు వేసిన వారిపై చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సిద్దవటం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మంగళవారం జరిగిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొగ్గిడివారిపల్లె పంచాయతీ, మాధవరం–1 పంచాయతీలో అక్రమ లే అవుట్లు వేసిన వారికి తాఖీదులు జారీ చేయాలన్నారు. సిద్దవటం పరిధిలోని పంచాయతీలలో డయేరియాపై దృష్టి సారించాలని, నీటి ట్యాంకులు శుభ్రపరచి నోటీసు బోర్డులో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వర రావు, ఉపాధి హామీ ఏపీఓ నరసింహులు, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ లక్ష్మీనరసయ్య, గ్రామ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు


తీవ్రంగా గాయపడిన యువకుడు

రైల్వేకోడూరు అర్బన్: మండలంలోని అనంతరాజుపేట ప్రధాన రహదారిపై బైక్‌ను ఇన్నోవా కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న ఇన్నోవా కారు.. కోడూరు నుంచి రాజంపేట వైపు వెళ్తున్న మోటార్ బైక్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో వారిని కోడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

కాపాడితే పాల సిరులు

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం తరువాత పశు పోషణకు అంత ప్రాధాన్యం ఇస్తారు. పశువులు జబ్బున పడినప్పుడు సరైన సమయంలో వైద్యం అందించాలి. లేగ దూడ పుట్టిన సమయం సంభవించే వ్యాధులను ముందుగానే గుర్తించి సకాలంలో వైద్యం అందించకపోతే పాడి రైతుకు నష్టం వాటిల్లుతుంది. పశు వైద్యుల సూచనలు పాటిస్తే లేగ దూడ.. రేపటి పాడి ఆవుగా మారి జీవనాధారం ఇస్తుంది.

- బొడ్డువాపు వ్యాధి అత్యంత ప్రమాదం
- జాగ్రత్తలు పాటిస్తే నిర్మూలన సాధ్యం
- నిర్లక్ష్యం చేస్తే పాడి రైతుకు నష్టం

గుర్రంకొండ : పాడి రైతు ఇంట సిరులు కురిపించే లేగ దూడలకు సంబంధించిన వ్యాధులను ఎప్పటికప్పుడు గమనించి తగిన సంరక్షణ చర్యలు పాటించడం ఎంతో ఉత్తమం. శుభ్రమైన వాతావరణంలో దూడలను పెంచడంతోపాటు నాణ్యమైన పాలు అందించడం ద్వారా ఈ వ్యాధి అరికట్టవచ్చు. లేగ దూడల్లో సీజనల్‌గా వచ్చే బొడ్డువాపు వ్యాధికి నిర్ణీతమైన సమయంలో చికిత్స అవసరం. తద్వారా దూడల మరణాల శాతాన్ని తగ్గించవచ్చు. పశువుకు దూడ జన్మించిన వెంటనే వైద్యుల సూచనలు, సలహాల మేరకు కనీస జాగ్రత్తలు తీసుకుంటే బొడ్డువాపు వ్యాధిని నివారించవచ్చు.


బొడ్డువాపు వ్యాధి సోకిన లేగదూడను పరిశీలిస్తున్న పశు వైద్యాధికారి సునీల్


దూడకు వైద్య చికిత్స అందిస్తున్న పశు వైద్య సిబ్బంది

వ్యాధి ఎలా సంక్రమిస్తుందంటే

లేగ దూడల్లో అన్నింటి కంటే బొడ్డు వాపు వ్యాధి అత్యంత ప్రమాదకరమైంది. అపరిశుభ్రమైన వాతావరణంలో పుట్టినా, ముర్రుపాలు తగిన రీతిలో తాగించకపోయినా ఈ వ్యాధి సంక్రమిస్తుంది. దీనిని సకాలంలో అరికట్టకపోతే ప్రమాదకర పరిణామాలకు దారితీసే అవకాశముంది. సాధారణ దూడ పుట్టిన నాలుగు రోజుల నుంచి నెల రోజుల లోపు తీవ్ర జ్వరం వస్తే దానిని బొడ్డు వాపు(ఆంబ్లికల్‌ఎబ్సెస్)గా గుర్తించాలి. పాడి రైతు సత్వరమే పశువైద్యాధికారిని సంప్రదించి పరిస్థితి వివరించాలి. దూడ పుట్టిన సమయంలో బొడ్డు నరాన్ని సరిగ్గా కత్తిరించకపోవడంతో ఈ వ్యాధి ఎక్కువగా సోకే ప్రమాదముంది. ఎందుకంటే బొడ్డు నరం ద్వారా శరీరంలోకి సూక్ష్మ క్రిములు ప్రవేశించడంతో బొడ్డు వాపు వ్యాధి వచ్చే అవకాశముంది. ఒక్కో సారి బొడ్డు కోసేందుకు వినియోగించే బ్లేడు తుప్పు పట్టినా, స్టెరిలైజ్ చేయకపోయినా ఈ వ్యాధి సోకుతుంది. పశువుల షెడ్డులో దగ్గర దగ్గరగా కట్టిన దూడలు చప్పరించడం వలన గానీ లేదా నేలను తాకి మట్టి తినడం వల్ల ఈ వ్యాధి సోకే ప్రమాదముంది.

నిర్లక్ష్యం చేస్తే ఎంతో నష్టం

లేగ దూడ పుట్టిన సమయంలో సోకే బొడ్డువాపు వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే పాడి రైతుకు ఎంతో నష్టం సంభవిస్తుంది. ప్రస్తుత మార్కెట్లో ఒక పాడి ఆవు విలువ సుమారు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల విలువ ఉంటుంది. చేస్తుంది. ఆడ లేగదూడ పుట్టినప్పటి నుంచి మంచి డిమాండ్ ఉంటుంది. లక్ష్మీ పుట్టిందని పాడి రైతులు భావిస్తారు. ఆడ లేగదూడ పుట్టిన ఏడాదిన్నర నుంచి రెండేళ్ల లోపు పాడి ఆవుగా రూపాంతరం చెందుతుంది. దీంతో పాడి రైతు ఇంట సిరులు కురిపిస్తాయి ఈ లేగదూడలు. అలాంటి వాటిని ప్రారంభంలో నిర్లక్ష్యం చేస్తే పాడి రైతు లక్షల రూపాయలు నష్టపోయే ప్రమాదం ఉంది.

వ్యాధి లక్షణాలివీ..

- ఈ వ్యాధి సోకిన లేగ దూడకు తొలుత బొడ్డు వద్ద వాపు వస్తుంది. అది క్రమేపీ పెద్దదవుతూ దుర్వాసనతో కూడిన చీము కారుతుంది.
- దూడకు జ్వరం వచ్చి తగ్గక పోవడంతో నీరసించిపోతుంది. తల్లిపాలు తాగదు.
- ముక్కు నుంచి నీరు కారిపోతూ శ్వాస తీసుకొనేందుకు కష్టపడుతుంది. మల విసర్జన సక్రమంగా జరగక మలబద్ధకంతో బాధపడుతుంది.

నివారణా చర్యలివీ..

- పశువులు ఉండే ప్రదేశాన్ని తొలుత పరిశుభ్రంగా ఉంచాలి. పశువుల షెడ్డు చుట్టూ సూక్ష్మ జీవులు దరిచేరకుండా వ్యాధికారక నివారణ మందు పిచికారీ చేయించాలి.
- బొడ్డువాపు వ్యాధి సోకిన దూడను సత్వరమే మంద నుంచి వేరు చేసి వ్యాధి లక్షణాలు తగ్గిన తరువాత మళ్లీ మందలో కలపాలి.
- బొడ్డు నరాన్ని రెండు అగుళాలు వదలి కత్తిరించే సమయంలో కొత్త పరికరాన్ని వినియోగించాలి. కత్తిరించిన తరువాత మూడు రోజుల వరకూ టించర్ అద్దుతూ ఉండాలి. కాకులు, కోళ్లు ముక్కుతో పొడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- లేగ దూడ పుట్టిన వెంటనే మూతికి బట్టలు లేదా చిక్కాలు కానీ అమర్చాలి.

చికిత్స విధానం

బొడ్డు వాపువ్యాధి నివారణకు సుమారు పది రోజుల సమయం పడుతుంది. వాపు గట్టిగా ఉన్నట్లయితే మెత్తబడే వరకూ అయోడిన్ ద్రావణంతో మర్దన చేయాలి. పలుచని వస్త్రంతో ఉప్పు ముద్దగా కట్టి వేడి చేసి నీటితో కాపడం పెట్టాలి. వాపు బాగా మెత్తబడిన తరువాత గడ్డ మధ్యలో రంధ్రం చేసి చీము పూర్తిగా పిండివేయాలి. అనంతరం పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో లోపలి వరకూ మూడుసార్లు కడిగి దూదితో పొడిగా శుభ్రంచేయాలి. టించర్ ముంచిన బాండేజ్ క్లాత్‌తో రంధ్రంలో సరిపడా ఎక్కించాలి. రోజు విడిచి రోజు టించర్ క్లాత్ మార్చుతూ ఉండాలి. ఇన్‌ఫెక్షన్ తగ్గే వరకూ యాంటీ బయాటిక్ మందు దూడకు అందజేయాలి. లేగ దూడలు బలహీనంగా ఉంటే గ్లూకోజ్, బి–కాంప్లెక్స్ ఇంజెక్షన్లు ఇవ్వాలి.

వైద్యుల సలహాలు పాటించాలి



లేగ దూడ పుట్టిన సమయంలో వచ్చే బొడ్డువాపు వ్యాధిని అరికట్టేందుకు పశు వైద్యుల సలహాలు తీసుకోవాలి. పాడి రైతులు సకాలంలో స్పందించి పశువైద్య శాఖ సిబ్బందిని సంప్రదిస్తే ఈ వ్యాధి వెంటనే నివారించవచ్చు. నిర్లక్ష్యం చేస్తే లేగదూడ ప్రాణానికే ప్రమాదం. ప్రస్తుత పరిస్థితుల్లో నేటి లేగ దూడే.. రేపటి పాడిఆవు. మార్కెట్లో ఒక్క పాడి ఆవు విలువ రూ.లక్ష వరకూ ఉంది. ఈ విషయం దృష్టిలో ఉంచుకొని లేగదూడను సంరక్షించుకుంటే పాడి రైతుకు ఎంతో లాభదాయకం. – సునీల్ నాయక్, మండల పశు వైద్యాధికారి, గుర్రంకొండ

ప్రభుత్వ ఆదాయానికి గండి


రాత్రి వేళల్లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఈబీ ఎస్ఐ రవిబాబు, పోలీసులు

సిద్దవటం : రాత్రి వేళల్లో కొంతమంది ఇసుక అక్రమ రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని సిద్దవటం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఎస్ఐ రవిబాబు తెలిపారు. విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పెన్నానది పరివాహక ప్రాంతాలు వంతాటిపల్లె, ఎస్.రాజంపేట, మూలపల్లె, టక్కోలి గ్రామాల నుంచి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నారన్నారు. ఇసుక రవాణాను అరికట్టేందుకు రెండు బృందాలు ఏర్పాటుచేశామని, సోమవారం రాత్రి విస్తృతంగా తనిఖీలు చేశామని పేర్కొన్నారు. మండలంలోని నేకనాపురం రహదారి గూండా ఇసుక వాహనాలు వెళ్తున్నట్లు స్థానికులు ఫోన్ చేస్తున్నారన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడితే సహించేది లేదని హెచ్చరించారు.

పారిశుద్ధ్య కార్మికుల గదికి నిప్పు


అగ్నికి ఆహుతైన పారిశుద్ధ్య సామగ్రి

మదనపల్లె : మండలంలోని కొత్త ఇండ్లు పంచాయతీ కార్యాలయంలోని పారిశుద్ధ్య కార్మికుల గదికి గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం నిప్పంటించగా, రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని పంచాయతీ కార్యదర్శి నివేదిక సమర్పించినట్లు ఎంపీడీఓ భానుప్రసాద్ తెలిపారు. విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ... సోమవారం రాత్రి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు పారిశుద్ధ్య కార్మికుల గది తాళం పగలగొట్టి అందులోకి ప్రవేశించి నిప్పు పెట్టారన్నారు. ప్రమాదంలో గదిలో నిల్వ ఉంచిన చెత్త బుట్టలు, పారిశుద్ధ్య సామగ్రి పాక్షికంగా కాలిపోయాయన్నారు.

బాబోయ్ టమాట దొంగలు..!

- రూ. 8 లక్షల విలువ చేసే టమాటాల చోరీ
- రాత్రి వేళల్లో తోటలు ఖాళీ చేస్తున్న దుండగులు

గుర్రంకొండ : ఇన్నాళ్లూ.. చిన్న దుకాణాలపై విరుచుకుపడిన దొంగలు తాజాగా రైతు కష్టాన్ని దోచేందుకు వెనుకావడడం లేదు. టమాటా ధరలకు రెక్కలు రావడంతో ఏకంగా కాయలు దోచేసి తోటలను ఖాళీ చేస్తున్నారు. మండలంలోని గుర్రంకొండ, మర్రిమాకుపల్లె, శెట్టివారిపల్లె, తరిగొండ గ్రామాల్లో రైతులు సాగు చేసిన టమాటా తోటల్లో దొంగలు చొరబడి కాయలు తీసి చోరీ చేస్తున్నారు. ఏకంగా రెండు, మూడు రోజుల్లోనే 16 మంది రైతులకు సంబంధించి దాదాపు రూ.8 లక్షల విలువ చేసే 380 క్రీట్ల టమాటాలు చోరీ చేశారు. నిందితులు రాత్రిళ్లు పొలాల్లో చొరబడి ఇప్పటి వరకూ రూ. 8 లక్షల విలువ చేసే టమాటాలు దోచుకెళ్లడం ఈ పరిస్థితికి అద్దంపడుతోంది. మార్కెట్లో టమాటా ధరలు ఒక్కసారిగా పెరగడమే ఇందుకు కారణం. ప్రస్తుతం మార్కెట్లో 25 కిలోల టమాటా క్రీట్ ధర రూ.2200 నుంచి రూ.2400 పలుకుతోంది. ఈ నేపథ్యంలో తమ కష్టాలు తీరిపోతాయని రైతులు ఆశపడినా.. యథేచ్ఛగా చోరీకి గురవడంతో లబోదిబోమంటున్నారు. ఇది గమనించిన రైతులు మర్రిమాకులపల్లెలో నిఘాపెట్టి కాయలు చోరీ చేస్తుండగా పట్టుకోవడానికి ప్రయత్నించినా చిక్కకుండా పరారయ్యారు.


మర్రిమాకులపల్లె గ్రామంలో చిన్నప్ప టమాటా తోటలో దొంగలు కాయలు కోసుకెళ్లిన దృశ్యాలు

25 క్రీట్ల టమాటా చోరీ చేశారు

నా పొలంలో గత రాత్రి 25 క్రీట్ల టమాటాలు చోరీ చేసుకెళ్లారు. కళ్లెదుటే కాయల్ని చోరీ చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఆరుగాలం కష్టపడి సాగుచేసిన టమాటా పంటను దోచుకెళ్లడంతో దిక్కుతోచని స్థితి. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలి. – చిన్నప్ప, రైతు, మర్రిమాకులపల్లె

నేటి నుంచి తాళ్లపాకలో బ్రహ్మోత్సవాలు



అన్నమాచార్యుడు పూజించిన శ్రీ చెన్నకేశవస్వామి, అన్నమాచార్యుడు పూజించిన శ్రీ సిద్దేశ్వరస్వామి

రాజంపేట : పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలి తాళ్లపాకలోని పురాతన చెన్నకేశవస్వామి, సిద్ధేశ్వరాలయాల్లో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. మంగళవారం రాత్రి అర్చకులు బ్రహ్మోత్సవాలకు అంకుర్పారణ చేశారు. రెండు ఆలయాల్లో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. బుధవారం ధ్వజారోహణం, రాత్రి సిద్ధేశ్వరస్వామి హంస వాహనంపై, చెన్నకేశవస్వామి శేష వాహనంపై ఊరేగనున్నారు. ఈ సందర్భంగా దేవతా మూర్తుల కటౌట్లు ఏర్పాటు చేశారు. చెన్నకేశవస్వామి, సిద్దేశ్వరస్వామి, అన్నమాచార ధ్యాన మందిరం విద్యుద్దీపాలతో అలంకరించి చలువ పందిళ్లు వేశారు. టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

కువైట్‌లో చాగలగుట్టపల్లి వాసి మృతి


నాగేశ్వర(ఫైల్)

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని చాగలగుట్టపల్లికి చెందిన నాగేశ్వర(46) కువైట్‌లో ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందినట్లు మృతుడి భార్య దేవి, బంధువులు తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మృతుడు నాగేశ్వర స్వగ్రామం చాగలగుట్టపల్లి కాగా, ఆయన భార్య దేవి స్వగ్రామమైన చెంచర్లపల్లిలో నివాసముంటున్నారు. జీవనోపాధి నిమిత్తం 15 ఏళ్ల కిందట కువైట్‌కు వెళ్లాడని, సోమవారం ఉదయం నాగేశ్వర చనిపోయినట్లు ఫోన్ వచ్చిందని మృతుడి భార్య దేవి తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు (ఇద్దరు ఆడ సంతానం, ఒక కుమారుడు) ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా, చిన్న కుమార్తెకు ఆగస్టు 24వతేదీన వివాహం నిశ్చయించినట్లు మృతుడి భార్య దేవి కన్నీరు మున్నీరయ్యారు. పిల్లల ఉన్నత చదువులకోసం కువైట్ వెళ్లి మృతి చెందడంతో నాగేశ్వర కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని, తన భర్త మృతదేహాన్ని రప్పించాలని దేవి వేడుకున్నారు.

దళితులపై దాడి కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడు వెంకటసుబ్బారెడ్డి

ఒంటిమిట్ట : ఈ నెల 12న మండలంలోని పెన్నపేరూరు గ్రామంలో దళితుడు కదిరి ప్రభాకర్‌పై నూనె పోసి దాడి చేసిన సంఘటనలో నిందితుడు గజ్జల చిన్నపుగారి వెంకట సుబ్బారెడ్డి (35)ని మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ పురుషోత్తంరాజు తెలిపారు. సీఐ వివరాల మేరకు.. ఈ నెల 12న రాత్రి గజ్జల చిన్నపుగారి వెంకట సుబ్బారెడ్డి చిల్లర అంగడి ఎదురుగా ఉన్న అరుగుపై పడుకున్న తనపై కట్టెతో దాడిచేసి, మరుగుతున్న నూనెను అతడిపై పోసినట్లు ప్రభాకర్ ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు.. కడప స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్ దర్యాప్తు చేయగా వాస్తవమేనని నిర్ధారణ అయినట్లు సీఐ తెలిపారు. దీంతో మంగళవారం ఉదయం 11.30 గంటలకు సుబ్బారెడ్డిని అరెస్టు చేసి కడప ఏడీజే కోర్టు ఎదుట హాజరుపరచగా, ఈ నెల 30వతేదీ వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించమని తీర్పు ఇచ్చారన్నారు.

జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ గడువు పొడిగింపు

– కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి : వర్కింగ్ జర్నలిస్టుల ఆరోగ్య పథకం 2024–25 సంవత్సరానికి పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్, డీఎంఏసీ చైర్మన్ శ్రీధర్ చామకూరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ఏదైనా అనుకోని అనారోగ్యం సంభవించిన ప్రతిసారీ రూ.2లక్షల వరకు వైద్య సేవలు అందుతాయని తెలిపారు. ఏడాది కాలంలో ఎన్నిసార్లైనా పరిమితులు లేకుండా ఈ సదుపాయాలందిస్తారని చెప్పారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ తరహాలో వైద్య సేవలు పొందవచ్చన్నారు. వైద్య సేవల విషయంలో ఎలాంటి ఆదాయ పరిమితులు లేవని, అలాగే నిర్దేశిత చికిత్సకు సంబంధించి ఉచిత ఓపీ సేవలు పొందవచ్చని తెలిపారు. అక్రిడేషన్ పొందిన వారంతా ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ అన్నారు. www.cfms.ap.gov.in వెబ్ సైట్ ద్వారా హెచ్ ఆఫ్ అకౌంట్ నెంబరు. 8342-00-120-01-03-001-011, డీడీ కోడ్. 2703-0802-003కు రూ.1250 చెల్లించి వచ్చే సంవత్సరం మార్చి 31వతేదీ వరకు లబ్ధిపొందవచ్చన్నారు. ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, అక్రిడిటేషన్ జిరాక్స్, హెల్త్ స్కీమ్ దరఖాస్తు, కుటుంబసభ్యుల ఫొటోలు, ఆధార్ కార్డు కాపీలను జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నేడు మదనపల్లెకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ రాక

మదనపల్లె : కేంద్ర రోడ్, ట్రాన్స్‌పోర్ట్, హైవే మంత్రి, బీజేపీ సీనియర్ నేత నితిన్‌గడ్కరీ అన్నమయ్య జిల్లా మదనపల్లెకు బుధవారం రానున్నారు. పట్టణంలోని నక్కలదిన్నె సత్సంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ ఎం (ముంతాజ్‌అలీ) ఆధ్వర్యంలో జరిగే ఆదినాథ్ శ్రీ గురు మహావతార్ బాబాజీ ఆలయ ప్రాణప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొంటారు. అంతకుముందు రేణిగుంట ఎయిర్‌పోర్ట్ వీఐపీ లాంజ్‌లో ఏపీలోని నేషనల్‌హైవే ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం నక్కలదిన్నె సత్సంగ్ ఆశ్రమంలో గడుపుతారు.ఆశ్రమ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఆదినాథ్ శ్రీ గురు మహావతార్ బాబాజీ ఆలయంలో ప్రాణప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రికి తిరుమలలోని వకుళమాత నిలయం గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. కాగా, కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ పర్యటన సందర్భంగా పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ ప్రసాదరెడ్డి తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, ఆర్డీఓ హరిప్రసాద్‌తో కలిసి డీఎస్పీ ప్రసాదరెడ్డి సత్సంగ్ ఫౌండేషన్‌లో ఏర్పాట్లు పర్యవేక్షించారు. మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్యపనులు, బ్యూటిఫికేషన్, జంగిల్ క్లియరెన్స్ తదితర పనులు చేపట్టారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి, ఆర్డీఓ హరిప్రసాద్ తదితరులు

గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తుల మృతి

గోపవరం : మండలంలోని శ్రీనివాసపురం సమీపంలో నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై మంగళవారం ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి చెందారు. సుమారు 60 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు. అదే వయస్సు కలిగిన మరో వ్యక్తి రోడ్డు పక్కనే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు బద్వేలు రూరల్ ఎస్ఐ రవికుమార్, సిబ్బంది చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. వ్యక్తి పక్కలో ఖాళీ మద్యం బాటిల్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వ్యక్తులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాలను బద్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి ఖననం చేశారు.


మృతిచెందిన వృద్ధుడు

అండర్–19 వన్డే క్రికెట్ టోర్నీ ప్రారంభం

విజయం సాధించిన కడప, విశాఖ, రెస్టాఫ్ సెంట్రల్‌జోన్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం మైదానం వేదికగా ఏసీఏ అండర్–19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా ప్రారంభమైంది. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, రెస్టాఫ్ సౌత్ జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సౌత్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 37.1 ఓవర్లలో 133 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని మన్విత్‌రెడ్డి 36 పరుగులు చేశాడు. కడప బౌలర్లు ప్రణవ్‌రెడ్డి 4, ధీరజ్‌కుమార్‌రెడ్డి 3, ధర్మసేనారెడ్డి రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 23.4 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులో గురువి ష్నేష్ 43 పరుగులు చేశాడు.


కేఓఆర్ఎం మైదానంలో తలపడుతున్న విశాఖ, నార్త్‌జోన్ జట్లు


ఖాజామోహిద్దీన్ (121 పరుగులు)


సుశాంత్ 121 పరుగులు

విశాఖ జట్టు విజయం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విశాఖపట్నం, రెస్టాఫ్ నార్త్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నార్త్‌జోన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 273 పరుగులు చేసింది. జట్టు లోని ప్రసాద్ 54 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నార్త్‌జోన్ జట్టు 50 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. జట్టులో సుశాంత్ 121 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. విశాఖ బౌలర్లు రచిత్ 2, యువన్ 2 వికెట్లు తీశారు. దీంతో విశాఖపట్నం 71 పరుగుల తేడాతో విజయం సాధించింది.

సెంట్రల్‌జోన్ జట్టు గెలుపు..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కృష్ణా, రెస్టాఫ్ సెంట్రల్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సెంట్రల్ జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 50 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. జట్టులోని శ్రీనివాస్ 75 పరుగులు, రేవంత్ నాగకుమార్ 63 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 237 పరుగులు చేసింది. జట్టులోని ఖాజామోహియుద్దీన్ 121 పరుగులు చేశాడు. సెంట్రల్‌జోన్ బౌలర్లు ఆదిత్య 2, షేర్షా 2 వికెట్లు తీశారు. దీంతో సెంట్రల్‌జోన్ 73 పరుగుల తేడాతో విజయం సాధించింది.